క్లుప్తంగా...

భాగ్యలక్ష్మీ పూజలకు సీపీకి ఆహ్వానం



చార్మినార్: దీపావళి వేడుకలను పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయంలో ఈనెల 12న జరిగే పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుతూ నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్యకు దేవాలయం ట్రస్టీ సూర్య ప్రకాష్ ఆహ్వాన పత్రం అందజేశారు. ఆయనతో పాటు ప్యారసాని వెంకటేష్ తదితరులున్నారు.

పరామర్శ



ఆలీవ్ ఆస్పత్రిలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: కారు ప్రమాదంలో గాయపడి నానల్‌నగర్‌లోని ఆలీవ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మౌలానా ముజామిల్ రషాదీ త్వరగా కొలుకోవాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను అసదుద్దీన్ ఒవైసీ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యులతో మాట్లాడి మరింత మెరుగైన చికిత్సను మౌలానాకు అందించాలని కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే కౌసర్ కూడా ఉన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



చాంద్రాయణగుట్ట: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ రియాసత్‌నగర్‌లోని హజ్రత్ షుజావుద్దీన్ దర్గా, జంగమ్మెట్‌లోని ఖాద్రీ చమాన్ దర్గాలను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో ప్రసిద్ధిగాంచిన ఈ దర్గాలను దర్శించుకోవడం ఆయన సెంటిమెంట్‌గా భావిస్తారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు సలీం బేగ్, ఫహద్ బిన్ అబ్దాద్, ఎం.ఎ.రహెమాన్, ఆజం షరీఫ్, మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్ పాల్గొన్నారు.

ఎంజే మార్కెట్‌లో జాతీయ ఐక్యత దినోత్సవ భారీ ర్యాలీ



గన్‌ఫౌండ్రీ: భారత జాతీయ ఐక్యత దినోత్సవ ర్యాలీని తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేపట్టారు. ఎంజే మార్కెట్ నుంచి ఎగ్జిబిషన్ వనిత కళాశాల వరకు ఈ ర్యాలీ కొనసాగించారు. బీజేపీ రాష్ట్రశాఖ కోశాధికారి రహ్మతుల్లా ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా షేక్ రహ్మతుల్లా, డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ..నేటి యువకులు, విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగుజాడలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనిత కళాశాల ప్రిన్సిపల్ శోభనా దేశ్‌పాండే, సంఘ సేవకులు శ్యామ్‌రావు ముధిరాజ్, ఎన్‌సీసీ అధికారి మేజర్ ఎన్.సుప్రియ, స్వాతి, నాగలక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని ఆదర్శప్రాయుడు



గన్‌ఫౌండ్రీ: పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ఆదర్శప్రాయుడని పలువురు ప్రముఖులు కొనియాడారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో పలువురు టీవీ నటీనటులకు అక్కినేని ఎక్సలెన్స్ టీవీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా మాట్లాడుతూ..నేటితరం నటీనటులు అక్కినేనిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు అక్కినేని సినీ సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సినీ నటుడు మురళీమోహన్, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, శృతిలయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఆమనిలతో పాటు పలువురు టీవీ నటీనటులు పాల్గొన్నారు.

మజ్లిస్ సిట్టింగ్ ఎమ్మెల్యేకు నో ఛాన్స్!

- అయోమయంలో చార్మినార్ మజ్లిస్ పార్టీ నాయకులు
- ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ దారెటు?
- ముంతాజ్ చార్మినార్‌కు వస్తే.. హైదరాబాద్‌కు అలీ మస్కతి?
- ఇంకా ఖరారు కాని మజ్లిస్ పార్టీ అభ్యర్థుల పేర్లు



చార్మినార్: చార్మినార్ నియోజకవర్గం నుంచి ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల పేర్లు ఖరారు కాగా.. మజ్లిస్ పార్టీతో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కాలేదు. ఈసారి చార్మినార్ సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు టికెట్ లభించదని ప్రచారాలు జరగుతుండడంతో.. ముంతాజ్ అహ్మద్ ఖాన్ కాకుండా మరెవరికి టికెట్ కేటాయిస్తారోనని చార్మినార్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. ఒకవేళ ఈసారి ముంతాజ్ అహ్మద్ ఖాన్‌కు పార్టీ టికెట్ లభించకపోతే.. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ తెచ్చుకుని మరీ పోటీ చేయించడానికి ఆయన కుమారులు పట్టుబడుతున్నట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చార్మినార్, యాకుత్‌పురా నుంచి కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్లు గతంలోనే చెప్పారని.. దీంతో ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో పాటు సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీలకు ఈసారి టికెట్లు లభించవని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

చివరి నిమిషం వరకు వేచి ఉండి..

పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు యాకుత్‌పురా సిట్టింగ్ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ నిశబ్దంగా ఉన్నప్పటికీ.. ముంతాజ్ అహ్మద్ ఖాన్ మాత్రం తనకు టికెట్ ఇవ్వకపోతే.. తన తనయునికి టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. చివరి నిమిషం వరకు వేచి ఉండి.. ఇక టికెట్ రాదని తెలిస్తే తప్పనిసరిగా కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ మారడం తప్పా.. ఆయన వద్ద మరో మార్గం లేదంటున్నారు. ముంతాజ్ అహ్మద్ ఖాన్ పార్టీ మారడానికి సిద్ధంగా ఉంటే.. తమ పార్టీలోకి ఆహ్వానించి చార్మినార్ నుంచి టికెట్ ఇచ్చి ఎన్నికల బరిలో దింపడానికి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సిద్ధంగా ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇప్పటికే టీటీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న అలీ మస్కతిని చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీలోకి దింపుతున్నట్లు రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ప్రకటించినప్పటికీ.. ఇప్పటికే రెండు దఫాలుగా విడుదలైన అధికారిక లిస్టులలో ఎక్కడా అలీ మస్కతి పేరు లేకపోవడంతో ముంతాజ్‌ఖాన్ కోసం ఈ సీటు రిజర్వ్ పెట్టినట్లు పాతబస్తీలో ప్రచారం జరుగుతోంది. ఒకవేళ చార్మినార్ నుంచి ముంతాజ్ ఖాన్‌కు టికెట్ లభిస్తే.. అలీ మస్కతిని హైదరాబాద్ పార్లమెంట్‌కు పోటీ చేయించే యోచనలో పార్టీ ఉన్నట్లు చెబుతున్నారు. అందుకే ఇంత వరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పార్టీ చార్మినార్ అభ్యర్థిని ప్రకటించడం లేదని అంటున్నారు.

ఈసారి మజ్లిస్ పార్టీకి దీటుగా.. కాంగ్రెస్

చార్మినార్ నుంచి మజ్లిస్ పార్టీకి దీటుగా తమ అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దింపాలని కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తోంది. 2009, 2014, 2018 ఎన్నికల్లో మజ్లిస్ పార్టీతో మజ్లిసేతర పార్టీలు హోరాహోరి ఎన్నికల పోరాటం చేసినప్పటికీ.. అంతిమ విజయం మజ్లిస్ పార్టీకే దక్కింది. మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా ఈసారి పాతబస్తీలో కూడా ఊహించని రాజకీయ పరిణాలు ఎదురవుతాయని రాజకీయ పరిశీలకు భావిస్తున్నారు. మజ్లిస్ పార్టీలో సిట్టింగ్‌లకు టికెట్లు లభించకపోతే.. పాతబస్తీ రాజకీయ ముఖ చిత్రం మారుతుందని అంటున్నారు. ముంతాజ్ అహ్మద్ ఖాన్ రాజకీయ అరంగేటం మజ్లిస్ బచావ్ తెహ్రీక్(ఎంబీటీ)తో మొదలైంది. ఎంబీటీ పార్టీ టికెట్‌పై యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం పార్టీ ఫిరాయించి మజ్లిస్ పార్టీలో చేరారు. అప్పటి నుంచి పోటీ చేసిన ప్రతి ఎన్నికలో విజయం సాధించారు. ప్రస్తుతం చార్మినార్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ముంతాజ్ అహ్మద్ ఖాన్ పార్టీ మారే ప్రసక్తే ఉండదని.. ఇవన్నీ రాజకీయ ఊహాగానాలేనని దారుస్సలాం నాయకులు అంటున్నారు.

ప్రజలకు అందుబాటులో మజ్లిస్ పార్టీ



ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రజల వెంట ఉంటూ వారికి అందుబాటులో ఉండేది మజ్లిస్ పార్టీ ఒక్కటే అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన ఇంటింటికీ మజ్లిస్ కార్యక్రమంలో భాగంగా టోలిచౌకీ, నానల్‌నగర్, లంగర్‌హౌస్ బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాము పదవీలో ఉన్న లేకున్నా కూడా ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. అంతే కాకుండా మజ్లిస్ పార్టీ కులమతాలకు, వర్గాలకు అతీతంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో డ్రైనేజీ వేయడానికి ఎంపీ అసదుద్దీన్ చొరవతో సుమారు 300 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఆయన అన్నారు. మునుముందు కూడా తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు మహిళలు సన్మానించారు.

'కార్వాన్‌లో మజ్లిస్‌ను మట్టికరిపిస్తాం'



మాట్లాడుతున్న అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి మజ్లిస్‌ను మట్టి కరిపిస్తామని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన కార్వాన్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బస్తీ వాసులను బీజేపీకి ఓటు వేయాలని కోరారు. మజ్లిస్ పార్టీ గుండాల పార్టీ అని ఆ పార్టీలో ఉన్న వారంతా ముస్లిం, మైనార్టీల పేరు చెప్పుకోని పబ్బంగడుపుతున్న వారే అని ఆరోపించారు. పాతనగరంతో పాటు కార్వాన్‌లో అభివృద్ధి ఎక్కడ ఉందో మజ్లిస్ నాయకులు చూపించాలని ఆయన ప్రశ్నించారు. ఈసారి తాను గెలవడంతో పాటు రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు.

వాల్మీకి రామాయణం స్ఫూర్తిదాయకం



వాల్మీకి మందిరంలో పూజలు చేస్తున్న అమర్‌సింగ్

జియాగూడ: వాల్మీకి రామాయణం నిత్య జీవితానికి స్ఫూర్తిదాయకమని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం జియాగూడ వాల్మీకి మందిరంలో ప్రగతి దీవాస్ వాల్మీకి జయంతి వేడుకలు మేతర్ ప్రగతి సంఘ్, ఆలయ ఆలయ అధ్యక్షుడు విజయ్ రిడ్లాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమర్‌సింగ్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేందర్ డేగాన్, సలహాదారుడు సతీష్ బిడ్లా, బీజేపీ ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షుడు రాహుల్ బగిడి, సంఘ్ సభ్యులు కార్యదర్శి నవీన్, మోను బిడ్లా, రాజేందర్ చిందాలియా, సందీప్ ధీరజ్, అజయ్, విక్కి, రాజు, బీజేపీ నాయకులు శివశంకర్, కె.శివాజీ, ఎం.శ్రీరాములు, ప్రకాష్ సింగ్, మాణిక్ ప్రభు, రఘునందన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి



సమావేశంలో ఎస్ఎం నరసింహస్వామి తదితరులు

చార్మినార్: ఈనెల 18న నిర్వహించనున్న విశ్వరూప మహాసభను జయప్రదం చేయడానికి పాతబస్తీ నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి కార్యాచరణను రూపొందించుకోవాలని ఎమ్మార్పీఎస్ చార్మినార్, చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి ఎస్ఎం నరసింహస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉప్పుగూడ ముక్కెర బస్తీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పాల్గొంటున్న ఈ విశ్వరూప మహాసభకు పాతబస్తీ నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కెర రమేష్, బాలకృష్ణ, దయానంద్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న చార్మినార్ జోన్ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ

చార్మినార్: విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు కనుక్కొని అవసరమైన వైద్య సేవలను అందజేయాలని చార్మినార్ జోన్ డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ సూచించారు. మంగళవారం ఆమె సంబంధిత ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 0–18 ఏళ్ల వయస్సున్న విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పాటు కాలేజీ విద్యార్థుల ఆరోగ్య సమాచారం తెలుసుకుని ఎవరికైనా అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్యం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈదిబజార్ పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

5న విశ్వబ్రాహ్మణుల సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: నవంబర్ 5న ఉప్పల్ భగాయత్‌లో నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఆత్మగౌరవ భవన నిర్మాణ స్థలంలో జరుగుతున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో మహాసభ ఆహ్వాన పత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలక, ప్రతిపక్షాలకు వినిపించేందుకు రాజకీయాలకు అతీతంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు లాల్‌కోట వెంకటాచారి, సంఘం అధ్యక్షులు వేములవాడ మదన్ మోహన్, ప్రధాన కార్యదర్శులు చొల్లేటి కృష్ణమాచార్యులు, రాళ్లబండి విష్ణుచారి, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, రాగిఫణి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

'మాతృదేవోభవ'



నాంపల్లి: సిద్దేంద్ర ఆర్ట్స్ అకాడమీ సమర్పణలో మంగళవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో మాతృదేవోభవ శీర్షికన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీ శృంగేరి మఠం, శాంకర తత్వ ప్రసార అభియాన్ రాజ్య సంచాలకులు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.ఈ.ఐ.ఎఫ్ డైరెక్టర్ నిర్మలకు మాతృమూర్తి పురస్కారాన్ని అందజేశారు. సెంట్రల్ టాక్స్ అండ్ కస్టమ్స్ హైదరాబాద్ జీఎస్టీ కమిషనరేట్ అడిషనల్ కమిషనర్ బి.రఘుకిరణ్, శత చిత్ర నిర్మాత రామ సత్య నారాయణ, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈదా శ్యామ్యూల్ రెడ్డి, ప్రముఖ చలన చిత్ర నటి కవిత, సిద్దేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు, కళా స్రవంతి డాక్టర్ దేవసేన, ప్రముఖులు ఆనందరెడ్డి పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.2.70 లక్షల నగదు పట్టివేత

జియాగూడ: ఎన్నికల కోడ్‌లో పోలీసుల తనిఖీలు జోరుగా కొనసాగుతుంది. మంగళవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో కట్టమైసమ్మ ప్రాంతంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో అంజయ్య అనే ఓ వ్యక్తి మేకలమండిలో వ్యాపారీ. ఇతను తనిఖీల్లో రు.2.70 లక్షల నగదుతో పోలీసులకు పట్టుబడ్డాడు.

ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

విజయనగర్‌కాలనీ: ఎన్నికల నిబంధనలకు విరుధంగా ద్విచక్ర వాహనంలో నగదు తీసుకువెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.2.17 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, అడ్మిన్ ఎస్.మహ్మద్ జాహేద్ తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ జేబాబాగ్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సలీం (57) ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనం డిక్కిలో నగదును తీసుకు వెళ్తున్నాడు. ఆసిఫ్‌నగర్ కూడలీలలో పోలీసుల తనిఖీల్లో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించిన సరైన పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్న నగదును నాంపల్లి రిటర్నింగ్ అప్పగించారు. పోలీసుల తనిఖీల్లో ఎస్ఐ హైమా, సుశాం పాల్గొన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి



సుల్తాన్‌బీన్ అలీని సత్కరిస్తున్న డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని హైదరాబాద్ జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. పదేళ్లల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు. మిస్టర్ యూనివర్స్–2023 అంతర్జాతీయ పోటీల్లో విజేతగా నిలిచిన సుల్తాన్‌బీన్ అలీని టీఎన్జీవోస్ కార్యాలయంలో ఆయన ఘనంగా సత్కరించి ప్రసంగించారు. కొన్ని సంవత్సరాలుగా సుల్తాన్‌బీన్ అలీ విశ్వవ్యాప్తంగా ఫిట్‌నెస్, బాడీబిల్డింగ్ ఫెడరేషన్ బంగారు పతం సాధించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, ముఖిం ఖురేషి, శ్రీధర్ నాయుడు, పర్వతాలు, తాహాసీఫ్ ఖాన్, రామకృష్ణారెడ్డి, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ సీనియర్ నేత ఎన్‌సీటీ ఆచార్యులు మృతి



అబిడ్స్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సీనియర్ నేత ఎన్‌సీటీ ఆచార్యులు మృతి చెందారు. చిన్నప్పటి నుంచి సంఘ్ పరివార్‌లో పనిచేసిన ఆచార్యులు ఆర్ఎస్ఎస్ గోల్కొండ బాగ్, మహాదేవపట్నం సంఘ్ చాలక్‌గా కొనసాగారు. ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్‌లో అనేక పదవుల్లో కొనసాగిన ఆయన మెహిదీపట్నం ఎల్ఐసీ కాలనీలోని ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. నగరంతో పాటు రాష్ట్రంలోని పలువురు సంఘ్ పరివార్ నాయకులు ఆయన మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజులు

అబిడ్స్: ఎన్నిల సమయం నెలరోజుల వ్యవధి ఉండడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అబిడ్స్ డివిజన్ ఏసీపీ ఆకుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహతో పాటు పెద్ద ఎత్తున పోలీసులు అబిడ్స్, ట్రూప్‌బజార్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ ఆకుల చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజు మాట్లాడుతూ.. ప్రతిరోజూ వివిధ సమయాల్లో అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రూ.50 వేలకు అధికంగా ఎవరైనా వెంటపెట్టుకుని ప్రయాణిస్తే పోలీసులు ఆధారాలు లేనిచో కేసులు నమోదు చేస్తామన్నారు. డబ్బులు అధికంగా ఉన్నప్పుడు వాటి రశీదులు, ఆధారాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రివేళ ఈ తనిఖీలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. వ్యాపార కేంద్రాలు, ప్రధాన చౌరస్తాల్లో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

'గోషామహల్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తాం'



మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్

అబిడ్స్: గోషామహల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. ధూల్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..పదేళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు. ఎన్నికలప్పుడు ప్రజల వద్దకు వచ్చే బీజేపీని, ఎమ్మెల్యే రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తామన్నారు. 20 వేలకు పైగా లోధ్ కులస్తుల ఓటర్లు ఉన్నారని తనకు టికెట్టు ఇస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో మంత్రి తలసాని సహకారంతోనే కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆయన అన్నారు.

కాంగ్రెస్ పార్టీకి క్రాంతికుమార్, శైలజ రాజీనామా



ఎస్.పీ.క్రాంతికుమార్, శైలజ

చార్మినార్: పాతబస్తీకి చెందిన భార్యాభర్తలైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేసిన దివంగత ఎస్.పాండురంగారావు కుమారుడు ఎస్.పీ.క్రాంతికుమార్, ఆయన భార్య శైలజ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు మంగళవారం ప్రకటించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పనితీరు తమకు నిరాశను కల్పిస్తోందని.. ఆయన హయాంలో బీసీ నాయకులకు తీవ్ర నష్టం జరుగుతోందని.. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తాము రాజీనామా చేస్తున్నామన్నారు. ఎస్పీ క్రాంతికుమార్ యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించగా.. ఆయన భార్య ఎస్.శైలజ హైదరాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన పొన్నాల లక్ష్మయ్య అనుచరులుగా ఉన్న వీరు ఆయన బాటలో నడవనున్నట్లు తెలుస్తోంది.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న రవికుమార్, అమృత్‌కుమార్ జైన్

అబిడ్స్: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, నవభారత్ నిర్మాణ్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రవికుమార్, సంఘ సేవకుడు అమృత్‌కుమార్ జైన్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం నవాబులను తరిమికొట్టిన మహానేత సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.



గుడిమల్కాపూర్‌లో..

జనహిత్ కార్యాలయంలో...

గోల్కొండ: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. గుడిమల్కాపూర్‌లోని జనహిత్ కార్యాలయంలో జరిగిన వేడుకల సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ, దేవర శ్రీనివాస్, నామా యాదగిరి, గంగాధర్, ప్రభు పూజారి, బాలకృష్ణ తదితరులున్నారు.

లోతుగా అధ్యయనం చేసిన తర్వాతే రచనలు చేయాలి

సుల్తాన్‌బజార్: సాహిత్యాన్ని, సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసిన తర్వాతనే రచనలు చేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సలీం నవ రచయితలకు సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో ఏర్పాటు చేసిన 'నేను నా రచనలు'అనే కొత్త కార్యక్రమంలో ఆయన తొలి ప్రసంగం చేశారు. 1980లో 'మనిషి'అనే తొలి కథతో ప్రారంభించి ఇప్పటి వరకు 300కు పైగా కథలు రాసి 12 సంపుటాలుగా ముద్రించానని, 30 నవలలు వెలువరించానని, అనేక రచనలు ఇతర భాషల్లోకి అనువాదం కావడమే కాకుండా ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకోగలిగానని సలీం అన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ..జీవిత పాఠాలే సలీంను గొప్ప రచయితగా వ్యక్తిగా మలిచాయన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సి.కాసీం విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ 'నేను–నా–రచనలు'కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని, ప్రఖ్యాత కవి రచయితలు, పరిశోధకులు, విమర్శకులు తమ రచనల గురించి, జీవితంలో సాధించిన విజయాలను గురించి తామే వివరిస్తామన్నారు.